క్లుప్తంగా

హోం మంత్రిని కలిసిన ఈస్ట్‌జోన్ డీఎస్పీ



మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌బాబు

కొవ్వూరు: రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్ బాబు గురువారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలిశారు. కొవ్వూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా మార్కాపురం సబ్ డివిజన్ నుంచి తాను బదిలీపై రాజమహేంద్రవరం వచ్చినట్టు ఆయన తెలిపారు. బొమ్మూరు సీఐ విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న కసిరెడ్డి సీతారామ్

కొవ్వూరు: వేసవిలో ఆస్తుల క్రయ విక్రయదారుల దాహార్తి తీర్చేందుకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పట్టణానికి చెందిన శ్రీ శివ సాయి దామం సేవాసమితి వారు గురువారం వాటర్ కూలర్‌ను బహూకరించారు. తమ కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు సేవాభావంతో కూలర్ అందించడం అభినందనీయమని సబ్ రిజిస్ట్రార్ ఈ.వెంకటేశ్వరరావు అన్నారు. సంఘ సభ్యులు కసిరెడ్డి సీతారామ్, తాతయ్య బాబు, నగళ్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కొండపాడు సొసైటీ చైర్మన్‌గా వెంకట్రావు



సొసైటీ చైర్మన్ బొర్రా వెంకట్రావును అభినందిస్తున్న ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: మార్కొండపాడు సొసైటీ చైర్మన్‌గా బొర్రా వెంకట్రావు గురువారం ఆ సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మట్టా వీరాస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొసైటీల బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. సొసైటీ పర్సన్ కాకి సంజీవరావు, కార్యదర్శి పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ సెంటర్లో 50 మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు చేతుల మీదుగా గురువారం అల్పాహారం అందజేశారు. ఆ సంస్థ డైరెక్టర్ గోకవరపు బాబులు ఆధ్వర్యంలో 10 రోజుల పాటు విద్యార్థులకు అల్పాహారం అందజేస్తారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, మానవత సంస్థ సభ్యులు గోకవరపు బాబులు, సనపల రాజశేఖర్, కె.ప్రసన్న కుమార్, జేవీ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కొవ్వూరు: గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కు వినతి పత్రం సమర్పించారు. సకాలంలో రైతులకు గోనె సంచుల అందించే విషయంలో ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్న హామీ, మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరారు.రైతు భరోసా రూ.12,500 ఇస్తామని, రూ.7,500 లే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. పట్టణంలోని టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని, శివారు కాలనీల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల దీక్ష

నిడదవోలు: ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం బీజేపీ శ్రేణులు ప్రజా దీక్ష చేశాయి. కార్యక్రమయంలో నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు, కట్టుంగ అచ్చియ్య, తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, పల్లి రాఘవులు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కూడా ప్రైవేట్ విద్య

- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి అమలు
- విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్ల కేటాయింపు
- కొవ్వూరు డివిజన్‌లో రెండు విడతల్లో 324 మంది ఎంపిక



నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు (ఫైల్)

నిడదవోలు రూరల్: పేదింటి పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకోవచ్చు. ఫీజులు చెల్లించి కాదు.. ఉచితంగానే .. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు ఒకటో తరగతిలో కేటాయించాలని యాజమాన్యాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించి కొవ్వూరు డివిజన్ పరిధిలో తొలి రెండు విడతల్లో 324 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మిగిలిన పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉన్నత చదువులే లక్ష్యంగా..

విజ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచవచ్చనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సమీప ప్రాంతాల పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ మేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను పక్కాగా అమలు చేస్తోంది. దీంతో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలలు ఉండగా వాటి పరిధిలో సుమారు మూడు వేల మంది విద్యార్థులు ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో 187 మందిని, రెండోవ విడతలో 137 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.

పారదర్శకతకు పెద్దపీట

అన్ని వర్గాల పేద పిల్లల్ని ఒకటో తరగతి ప్రైవేట్ లేదా కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ వ్యయంతో అభ్యసించే అవకాశాన్ని సర్కారు కల్పించింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 12(1)(సి) అమలులో భాగంగా ప్రతి పాఠశాల్లోనూ 25 శాతం సీట్లు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టింది. దరఖాస్తు మొదలు ఎంపిక వరకూ అంతా ఆన్‌లైన్‌లోనే చేపట్టిన ప్రభుత్వం ఈపథకం అమలులో పారదర్శకతకు పెద్దపీట వేసింది. సీట్లు పొందే విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు ప్రభుత్వం ట్రోల్ ఫ్రీ నంబర్ 14417ను అందుబాటులోకి తెచ్చింది.

సీట్ల కేటాయింపు, ఫీజుల చెల్లింపు ఇలా...

ప్రతి ప్రైవేట్ పాఠశాలలో అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లను యాజమాన్యాలు కేటాయించాలి. ఇందుకు 6–14 మధ్య వయసు పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని అడ్మిషన్‌కు రూ.6,500 గా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో అమ్మఒడి పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు అందజేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బుతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును, విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇ విధివిధానాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.



మద్దాల శేఖర్‌బాబు, నాగలక్ష్మితో శశి స్కూలుకు ఎంపికైన విద్యార్థిని సుష్మంజలి

మండలాలవారీగా తొలి రెండు విడతల్లో ఎంపికైన విద్యార్థుల సంఖ్య

మండలం	ఎంపికైన విద్యార్థులు
నిడదవోలు	38
పెరవలి	4
ఉండ్రాజవరం	12
కొవ్వూరు	86
చాగల్లు	29
తాళ్లపూడి	18
గోపాలపురం	23
దేవరపల్లి	66
నల్లజర్ల	48
మొత్తం	324

జగనన్నకు రుణపడి ఉంటాం

నా భర్త శేఖర్‌బాబు రోజువారి కూలీ పనులకు వెళ్తూ మా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నా కుమార్తె సుష్మంజలిని ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలంటే అంత ఫీజులు కట్టలేం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించడంతో దరఖాస్తు చేశాను. మా అమ్మాయికి శశి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సీటు వచ్చింది. ఇంత మేలు చేసిన జగనన్నను ఎన్నటికీ మరువం.

–మద్దాల నాగలక్ష్మి, దారవరం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో గతేడాది ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ఎంపికైన వారికి చేర్చుకోని, అడ్మిషన్లు తిరస్కరించిన, ఫీజు చెల్లించాలని వేధించిన ప్రైవేట్ స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– డి.కిషోర్‌కుమార్, ఎంఈఓ, నిడదవోలు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

తాళ్లపూడి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండలంలోని తాడిపూడి సొసైటీ వద్ద ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు మండిగ వెంకట గిరిధర్ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధరను పొందాలన్నారు. రైతులకు క్వింటాల్‌కు రూ.1962 చొప్పున చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నామా శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి బొర్రా రామ చంద్రం, స్థానిక నాయకులు బాసుమళ్ల బ్రహ్మయ్య, గిద్దా రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నేత్ర దానం



నేత్రదానం చేసిన సత్యవతి

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ వేగేశ్వరపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు శీర్ల బ్రహ్మానందం తల్లి సత్యవతి (80) గురువారం మృతి చెందారు. సత్యవతి నేత్రాలను ఆమె కోరిక మేరకు దానం చేశారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యులు వేగేశ్వరపురం వచ్చి ఆమె కార్నియాలను సేకరించుకుని వెళ్లారు. వాటిని భద్రపరిచి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. సత్యవతి మృతికి ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, రాజమండ్రి ఆటో కన్సల్టెన్సీ యాజమాన్యం తదితరులు సంతాపం తెలిపారు.

రైస్ మిల్లుల సీఎంఆర్ సేకరణ నిలుపుదల

- కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీవోల తనిఖీలు
- నోటీసులు అతికించిన అధికారులు

చాగల్లు: నిబంధనలకు విరుద్ధంగా రైతుల వద్ద నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న మండలంలోని రెండు రైస్ మిల్లులపై అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ, పౌరసరఫరా శాఖల అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గురువారం దాడులు చేశారు. కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆధ్వర్యంలో బ్రాహ్మణగూడెంలోని సూర్యదత్త ట్రేడర్స్ రైస్‌మిల్లులోను, రాజమహేంద్రవరం ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి ఆధ్వర్యంలో దారవరంలోని శ్రీ తేజా ఏజెన్సీస్ రైస్‌మిల్లులోను తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు మల్లిబాబు, చైత్ర వర్షిణి మాట్లాడుతూ ఈ రెండు మిల్లులపై ముఖ్యమంత్రి కార్యాలయానికి రైతుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు ఈ మిల్లులో తనిఖీలు చేశామని చెప్పారు. రైస్‌మిల్లులపై వచ్చిన ఆరోపణలు తమ తనిఖీల్లో నిజమే అని నిర్ధారణ కావడంతో ఈ రెండు రైస్ మిల్లులను కస్టమైజ్డ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ చేసే ప్రక్రియ నుంచి తొలగిస్తున్నామని ప్రకటించారు. ధాన్యంలో నూక, తేమ శాతం ఎక్కువగా ఉన్నాయనే సాకుతో రైతుల నుంచి సొమ్ములు వసూలు చేసే రైస్‌మిల్లర్లకు ఇది హెచ్చరిక అని వారన్నారు. అనంతరం రెండు రైస్ మిల్లర్ల యాజమాన్యాలకు నోటీసులు అందజేశారు. రైతుల వద్ద నుంచి వసూలు చేసిన సొమ్ములను మిల్లర్లతో తిరిగి రైతులకు ఇప్పించారు. ఈ తనిఖీల్లో డీఎస్‌వో పి.ప్రసాదరావు, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ ఎంవీ నాగార్జునరెడ్డి, ఎంఎస్‌వోలు పి.విజయ్‌భాస్కర్, ఎంవీ ప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్లు కె.నిరంజన్, బాపిరాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణగూడెంలో రైస్‌మిల్లుకు నోటీసులు అతికిస్తున్న కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు



దారవరంలో రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి

ఆర్బీకేలో పరిశీలించాకే ధాన్యం విక్రయించండి

- పెరవలి తహసీల్దార్ రాజరాజేశ్వరి
- రైస్ మిల్లర్లతో సమావేశం

పెరవలి: రబీ ధాన్యాన్ని విక్రయించే రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ధాన్యంలోని నూక, తేమ శాతాలను అంచనా వేసుకున్న తర్వాతే రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించాలని తహసీల్దార్ పి.రాజరాజేశ్వరి సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. దానికి భిన్నంగా నేరుగా ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తే అందుకు రైతులే బాధ్యత వహించాలన్నారు. ధాన్యంలో తేమ, నూక శాతం పేరుతో సొమ్ములు కట్టాలని రైతులపై మిల్లర్లు ఒత్తిడి చేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైసు మిల్లర్లు, రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తామని, ఆర్‌బీకేలు ఇచ్చిన నిబంధనల మేరకే ధాన్యాన్ని తీసుకుంటామని రైసుమిల్లర్లు మూకుమ్మడిగా అంగీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ రబీ ధాన్యం సేకరణ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల నుంచి నగదు వసూలు చేస్తే చర్యలు

నిడదవోలు రూరల్: ధాన్యంలో తేమ, నూక పేరిట రైతుల నుంచి నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.గంగరాజు హెచ్చరించారు. మండలంలోని సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి గ్రామాల్లోని రైస్ మిల్లులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. నిడదవోలు మండలంలో గోనె సంచుల కొరత లేకుండా ఆర్‌బీకేలు, రైస్‌మిల్లర్లతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.



పెరవలిలో రైస్‌మిల్లర్లతో తహసీల్దార్, ఎంపీపీ సమావేశం



సమిశ్రగూడెంలో రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగరాజు

తోగుమ్మిలో చంద్రమౌళీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం వద్ద హోమాలు చేస్తున్న రుత్విక్కులు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి తానేటి వనిత, జక్కంపూడి గణేష్

కొవ్వూరు: మండలంలోని తోగుమ్మి గ్రామంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం కన్నుల పండువలా నిర్వహించారు.ఆలయం ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో రుత్విక్కులు ఐదు రోజులుగా వివిధ రకాల హోమాలు నిర్వహించారు. ప్రముఖ పండితుడు యనమండ్ర వేణుగోపాలశాస్త్రి పర్యవేక్షణలో ఈ క్రతువులు జరిగాయి. గురువారం ఉదయం 6.47 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, జీవ కల్యాణం, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తోగుమ్మి సర్పంచ్ ఉప్పులూరి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఉప్పులూరి సూరిబాబు దంపతులతో పాటు గ్రామానికి చెందిన పలువురు జంటలు పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు(పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన) స్.రాజీవ్‌కృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, నాయకులు కొఠారు అశోక్‌బాబా, గారపాటి శ్రీనివాస్, గారపాటి వెంకటకృష్ణ, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న పాల్గొన్నారు.

జలకళ బోర్లకు విద్యుత్తు కనెక్షన్లు ఇస్తాం

పెరవలి: వైఎస్సార్ జలకళ పథకం కింద రైతుల పొలాల్లో వేసిన బోర్లు అన్నింటికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందిస్తామని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. ఈ పథకంపై చర్చించేందుకు విద్యుత్తు శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులతో గురువారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకం కింద మండలంలో 55 బోర్లు వేశారన్నారు. వాటికి విద్యుత్తు కనెక్షన్ల కోసం 49 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ నిశ్చల్ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే విద్యుత్తు కనెక్షన్లు ఇస్తామన్నారు.బోర్ల వద్ద రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఎంపీపీ విద్యుత్తు కనెక్షన్ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, రైతులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు విద్యుత్ కనెక్షన్ల పత్రాలు అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదు

వైఎస్సార్ సీపీ నేత 'బూరాడ'కు ఘన నివాళులర్పించిన ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నేత, మాజీ కార్పొరేటర్, స్థానిక 44వ వార్డు ఇన్‌చార్జి దివంగత బూరాడ భవానీ శంకర్‌కు వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం నగర శాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. గురువారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన బూరాడ భవానీ శంకర్ సంతాప సభ నిర్వహించారు. బూరాడ భవానీశంకర్ చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్, పార్టీ నగర శాఖ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితర ప్రముఖులు పుష్పాంజలి ఘటించి, ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ భరత్ మాట్లాడుతూ బూరాడ భవానీ శంకర్ కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందివ్వడమే కాకుండా భద్రత కల్పిస్తామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బూరాడను హత్య చేయాలంటే ఎంత ధైర్యం ఉండాలి, ఈ విష సంస్కృతిని ఎవరు పెంచి పోషిస్తున్నారనేది తెలియాలన్నారు. ఈ ప్రశాంత రాజమహేంద్రవరం నగరంలో ఈ హత్యలు, దోపిడీలను ఆదిలోనే తుంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పిల్లి నిర్మల, స్టాలిన్, మజ్జి అప్పారావు, మింది నాగేంద్ర, మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి, బర్రె కొండబాబు, టీకే విశ్వేశ్వరరెడ్డి, కానుబోయిన సాగర్ తదితరులు పాల్గొని బూరాడకు ఘన నివాళులర్పించారు.



భవానీశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ భరత్‌రామ్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలి

చాగల్లు: ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఎంపీడీవో బి.రాంప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన ఉపాధి పనులపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల పని దినాలను పెంచాలన్నారు. పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కూలీల మస్టర్‌లలో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిని సహించేది లేదని హెచ్చరించారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు జరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.ఈ సమావేశంలో టీఏ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కంబాలచెరువు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దుర్గా ప్రసాద్ అన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ(డీసీఈబీ) అందజేసిన 'సెలవుల్లో సరదాగా.. సమ్మర్ క్యాంప్' స్టడీ మెటీరియల్‌ను గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం లక్ష్యాన్ని తల్లిదండ్రులకు వివరించి, బుక్స్ అందజేశామన్నారు. ఉపాధ్యాయులందరూ ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల ద్వారా విద్యార్థులకు చేయాల్సిన కృత్యాలు పంపిస్తామన్నారు. విద్యార్థులు ఈ బుక్స్‌తో పాటు సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి దిన పత్రికలు కూడా చదవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.